క్లుప్తంగా

పాఠశాల ప్రహరీపై ప్రకటనల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

సంగెం : మండలంలోని కాపుల కనిపర్తిలోని ప్రభుత్వ స్కూల్ ప్రహరీపై ముద్రించిన ప్రైవేట్ ప్రకటనలను మంగళవారం తొలగించారు. 'ప్రభుత్వ గోడలపై ప్రైవేట్ ప్రచారం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి హెచ్ఎం శోభారాణి స్పందించారు. సంబంధిత ప్రకటనదారుకు సమాచారం అందించి తొలగించాలని స్పష్టం చేశారు. దీంతో బాధ్యులు సదరు ప్రకటనపై తెల్లని పేయింట్ వేయించారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



సాక్షి నెట్‌వర్క్ : పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని, అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా రూ.500 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన క్రమంలో మాజీ సర్పంచ్‌లను జిల్లా వ్యాప్తంగా పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, రాయపర్తి, తదితర మండలాల్లో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడారు. ప్రభుత్వ తీరును ఖండించారు. బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కోడి మంజులకు ఆదరణ



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన మాజీ మావోయిస్టు కోడి మంజుల సోమవారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఆమె ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. మావోయిస్టు పార్టీలోకి వెళ్లిన తర్వాత సుదీర్ఘ కాలంపాటు ఆమె అజ్ఞాత జీవితం గడిపారు. ఈ క్రమంలో గ్రామానికి చేరుకోవడంతో పలువురు ఆమెను ఆదరించారు. ఆమె గ్రామస్తులతో ఆప్యాయంగా మాట్లాడారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

నియామకం



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీకి చెందిన ఐలోని అభిషేక్ కేటీఆర్ సేన పరకాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మొంగని మనోహర్ ఆదేశాల మేరకు అభిషేక్‌కు జిల్లా అధ్యక్షుడు మైనాల నరేశ్ సోమవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం సురేశ్ మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

చెన్నారావుపేట : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు గొడిశాల వికాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ శ్రీవాణికి సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం వికాస్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ఇతర సర్వీసు క్రమబద్ధీకరణ, తదితర అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ రాజు, ప్రధాన కార్యదర్శి బాదావత్ నిట్టు, ఉపాధ్యక్షురాలు ప్రమీల, గౌరవ అధ్యక్షుడు చేరాలు, సభ్యులు అవినాష్, శ్యామ్, శ్యాం ప్రసాద్, రంజిత్‌కుమార్, వీరన్న, రవి, నర్సింహరాములు, శ్రీనాథ్, మమత, జ్యోతి, అనిత, ఉషా, స్వరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

ఖానాపురం : గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందాడు. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన పోల్కం సోమయ్య (65) ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పనుల కోసం ఫీల్డ్ అసిస్టెంట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు.

సృజనాత్మకత వెలికితీసేలా టాలెంట్ టెస్ట్

● ఫోరం సమన్వయకర్త భాస్కర్‌రావు



రాయపర్తి : విద్యార్థులతో భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు

రాయపర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా బయోలాజికల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు బయోలాజికల్ సైన్స్ ఫోరం సమన్వయకర్త, రిటైర్డ్ పీజీ హెచ్ఎం రావుల భాస్కర్‌రావు తెలిపారు. ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు సాయివర్ధన్, వర్షిత్‌రెడ్డి, రాంచరణ్, వినయ్‌కుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఉప్పలయ్య, రాంరెడ్డి, నాగార్జున, నరేందర్, రాధ, సుధాకరాచారి, పద్మశ్రీ, రమేశ్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన టెస్ట్‌లో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు కళ్లెపు శ్రీజ ప్రథమ, కళ్లెపు సాత్విక్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పాపమ్మ అభినందించి మాట్లాడారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమన్వయకర్తలుగా చిప్ప పరమేశ్వర్, కిశోక్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు రాగి శశిధర్, గజవెల్లి సుందర్, రవి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మల్లంపల్లి హైస్కూల్ విద్యార్థి సన్నీ ప్రథమ, నాచినపల్లి హైస్కూల్ విద్యార్థి ధినేశ్ ద్వితీయ, దుగ్గొండి హైస్కూల్ విద్యార్థి ఈశ్వర్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు స్థానిక హైస్కూల్ హెచ్ఎం రామస్వామి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు రాజు, కిరణ్‌కుమార్, లీలావతి, శ్రావణి, తిరుపతి, రమేశ్, కిరణ్, కిషన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు

'మార్షల్ ఆర్ట్స్'తో స్వీయ రక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న హెచ్ఎం రవీందర్

నెక్కొండ : మార్షల్ ఆర్ట్స్‌తో బాలికల స్వీయ రక్షణకు బాటలు పడతాయని మండలంలోని అప్పల్‌రావుపేట హైస్కూల్ హెచ్ఎం రవీందర్ తెలిపారు. సమగ్ర శిక్ష పథకంలో భాగంగా రాణిలక్ష్మిబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఆ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మార్షల్ ఆర్ట్స్ శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థినులకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బాలికలు శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడంతో బాలికల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. బాలికలు పాఠశాల స్థాయి నుంచి స్వీయ రక్షణలో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు గడ్డం రాజు, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, రవీంద్రనాథ్, యాకయ్య, భూలక్ష్మి, వెంకట్రాజం, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

● బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజు యాదవ్

నర్సంపేట : బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ కోరారు. పట్టణంలోని బీసీ పవర్ కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగినేని లకన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశానికి రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలకు దామాషా పద్ధతిన రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో బీసీ జనాభాకు తగినంత రాజకీయ అవకాశాలు లేవని ఆందోళన వెలిబుచ్చారు. రాజకీయ అవకాశాలు కలిగిన బీసీలు పదవులకే పని చేస్తున్నారని తెలిపారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి పని చేయడం లేదన్నారు. చట్టసభల్లో బీసీల వాటా దక్కించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సమావేశంలో బీసీ పవర్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు మోటం కన్ని, డివిజన్ కమిటీ బాధ్యుడు బాల్నె సుభాశ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆబోతు అశోక్, జిల్లా యూత్ కార్యదర్శి రాజేశ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామకృష్ణ, బూస రంజిత్, కార్మిక విభాగం డివిజన్ అధ్యక్షుడు బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఇద్దరు బీఆర్ఎస్ నాయకుల సస్పెన్షన్'

దుగ్గొండి : బీఆర్ఎస్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో ఇద్దరు నాయకులను సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లిపల్లికి చెందిన అంబీరు శివాజీ, అంబీరు రమేశ్ పార్టీకి ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారని గ్రామ శాఖ నుంచి ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. శివాజీ, రమేశ్‌లకు ఇక నుంచి పార్టీతో సంబంధం ఉండదని వివరించారు. పార్టీ నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ బలోపేతంలో 'యూత్' కీలకం

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



ప్రశాంత్‌ను సన్మానిస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకమని పోషించిందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి రంజిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో యూత్ కీలకంగా నిలిచిందని చెప్పారు. పార్టీ కల్పిస్తున్న అవకాశాలను నాయకులు సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నతంగా ఎదగాలని సూచించారు. యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడిగా సింగం ప్రశాంత్ ఎన్నికవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రశాంత్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. యువజనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాటుపడతామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిందని తెలిపారు. యువతకు నిత్యం అందుబాటులో ఉంటానని, సేవాభావంతో పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నాయకులు సుబ్బారెడ్డి, కుసుమ చెన్నకేశవులు, బండి శివకుమార్, ఆవుల శ్రీనివాస్, గడదాసు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి సురేఖ దాటవేత ధోరణి వీడాలి'

గీసుకొండ : మండలానికి చెందిన మాదాసి రాంబాబు వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ కోడెలను అక్రమంగా అమ్ముకున్న వ్యవహారంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దాటవేత ధోరణి వీడాలని బీఆర్ఎస్ సమన్వయ కమిటీ మండల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కోటగండి సమీపంలోని పీడీఆర్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాంబాబు 60 కోడెలను తీసుకొచ్చినట్లు ఒప్పుకున్నా, అతడికి కోడెలు ఇవ్వాలని సిఫార్సు చేసిన మంత్రి సురేఖ సమగ్ర విచారణకు ఆదేశించకుండా అక్రమాన్ని పరోక్షంగా వెనకేసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంపై స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాంబాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్, సమన్వయ కమిటీ నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, జక్కు మురళి, ముంత రాజయ్య, కొల్పుల కట్టయ్య, సిరిసె శ్రీకాంత్, కోట ప్రమోద్, సంతోశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తేమ పేరుతో కాలయాపన సరికాదు

● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుధ

నర్సంపేట రూరల్ : తేమ పేరుతో ధాన్యం కొనుగోలులో కాలయాపన సరికాదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ అన్నారు. మండలంలోని మాదన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి సమస్యలపై అధ్యయనం చేసింది. అనంతరం రాగసుధ మాట్లాడారు. కొనుగోలు కేంద్రం సమస్యల నిలయంగా ఉందన్నారు. బోనస్ పేరుతో రైతులను నిండా ముంచుతున్నారని తెలిపారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని చెప్పారు. వర్షం కురిస్తే ధాన్యం తడిసే ప్రమాదం ఉన్న క్రమంలో టార్పాలిన్ షీట్లు సైతం అందుబాటులో లేవన్నారు. గన్నీ సంచులను అందుబాటులో ఉంచలేదని, ఇప్పటివరకు బోనస్ ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనుమాల రమేశ్, కేశెట్టి శ్రీనివాస్, గుర్రం రవి, కందికొండ నర్సింహస్వామి, కొర్ర రమేశ్, యాకయ్య, కొత్తకొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంపాస్ బాక్స్‌ల పంపిణీ



సంగెం : మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడు బుగ్గారపు రామకృష్ణ సోమవారం కంపాస్ బాక్స్‌లు పంపిణీ చేశారు. అనుమాండ్ల మనోహర్ అతడి తల్లితండ్రులు లింగమ్మ-మల్లయ్య జ్ఞాపకార్థం రూ.30 వేల ఖర్చుతో పాఠశాల భవనానికి కప్పు నిర్మింపజేశారు. అలాగే రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 18 మంది 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ అనుముల శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అరెస్ట్‌లను ఖండించాలి'

నర్సంపేట : ఆశావర్కర్లు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం శాంతియుతంగా హైదరాబాద్‌లో ధర్నా చేయడానికి వెళుతుంటే అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. పట్టణంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. ఆశవర్కర్లు హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్లొద్దని వైద్యాధికారులు బెదిరింపులకు పాల్పడుతూ వాట్సాప్‌లో మెసేజ్‌లు పెట్టడం, ఫోన్లు చేసి బెదిరించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి వెళుతున్నారని గుర్తు చేశారు. ధర్నాలో పాల్గొన్న వారిని సస్పెండ్ చేస్తామని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజాపాలన సాగిస్తున్నామని ఊదరగొడుతున్న ప్రభుత్వం ప్రజస్వామ్యయుతంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుంటే అరెస్టులు, బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు.

'ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీ'

ఖానాపురం : ధాన్యం కొనుగోలులో మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. మిల్లర్లు 2–5 కిలోల మేరకు కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని చెప్పారు. మిల్లర్లు రైతుల ధాన్యం కోత విధించకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కలకోట్ల యాదగిరి, సామేల్, వీరన్న, నరేశ్, మల్లయ్య, వివేక్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన పర్శ లచ్చమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెట్టి ఎల్లేశ్ సోమవారం 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత లచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు అబ్బరబోయిన సారంగం, అల్లాడి కరుణాకర్, సుంకరి రమేశ్, అల్లాడి రాజు, చీరబోయిన అశోక్, అబ్బరబోయిన సోమరాజు, కుంట రాజు, అబ్బరబోయిన సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చిర్ర భిక్షపతి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ సోమవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, వైద్యం, ఆరోగ్య పరిస్థితి, తదితరాలపై అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



వర్ధన్నపేట : కేక్ కట్ చేస్తున్న మైస సురేశ్, నాయకులు



సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, పర్వతగిరి, సంగెం, గీసుకొండ, దుగ్గొండి, నెక్కొండ, రాయపర్తి, ఖానాపురం, తదితర మండలాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ను ముందుకు నడిపించడంలో సోనియాగాంధీ చేస్తున్న సేవలను కొనియాడారు.



చెన్నారావుపేట : కేక్ కట్ చేస్తున్న నాయకులు



పర్వతగిరిలో..



సంగెంలో..



గీసుకొండలో..



దుగ్గొండి : గిర్నిబావిలో..



నెక్కొండలో..



ఖానాపురంలో..



రాయపర్తిలో..

నేటి నుంచి మండలస్థాయి సీఎం కప్ పోటీలు

పర్వతగిరి : నేటి నుంచి స్థానిక మోడల్ స్కూల్‌లో అథ్లెటిక్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, తదితర అంశాల్లో మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు, టీంలు ఉదయం 10.30 గంటలకు మోడల్ స్కూల్‌కు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, కార్యాలయ సూపరింటెండెంట్ రూపేశ్, ఎంఎన్ఓ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్ విద్యార్థుల దాతృత్వం



నర్సంపేట : నర్సంపేటలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన సోచ్ బ్లెండ్ ఫౌండేషన్‌కు విరాళాల రూపంలో రూ.65 వేల 752 సేకరించి అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడారు. విద్యార్థులు సేవాగుణం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జ్ రాధ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా డబ్బు అందజేత



నర్సంపేట రూరల్ : మండలంలోని చంద్రయ్యపల్లిలో చంద్ర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు సముద్రాల బుచ్చి నర్సు ఇటీవల మృతి చెందగా అతడి భార్య కమలమ్మకు సంఘం అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, దుగ్గొండ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ చేతుల మీదుగా బీమా డబ్బు రూ.70 వేలు, అభయనిధి పథకం కింద రూ.10 వేలు సోమవారం అందజేశారు. అనంతరం శ్రీనివాస్, ఉస్మాన్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బానోత్ రమేశ్, పాలకవర్గ సభ్యులు వడ్డెపల్లి మృత్యుంజయుడు, బాషబోయిన రాజు, పాక రాజయ్య, సలపాల ప్రభాకర్, మామిడి ఐల్లయ్య, బాషబోయిన చరణ్‌రాజ్, బానోత్ సాంబయ్య, ఉప్పుల రాజు, అజ్మీర జితేందర్, ట్రెజరర్ ఎడెల్లి మహేందర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.